క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



తహసీల్దార్ శివరాముడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

పగిడ్యాల: మండల తహసీల్దార్‌గా నియమితులైన శివరాముడు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయానికి చేరుకున్న తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్‌లు రవి, మురళీ,మండల సర్వేయర్ శ్రీనువాసులు, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాధిక, వీఆర్వోలు నాగన్న, వెంకటస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ పరిధిలోని కృష్ణాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం వైద్యాధికారి గోపాల్, వైద్యసిబ్బంది సందర్శించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి జరగాల్సిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. బైర్లూటీ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రజిత, ఆరోగ్య కార్యకర్త మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా డేను జయప్రదం చేయండి

నందికొట్కూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన నిర్వహిస్తున్న క్విట్ ఇండియా డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పక్కీర్ సాహెబ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మెజార్టీ లేకపోయినా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం దుర్మార్గమని చెప్పారు. ఇటీవల ప్రవేశపెట్టి బడ్జెట్ కార్పొరేటర్లకు మేలు జరిగే విధంగా, పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపే విధంగా ఉందన్నారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత

కొత్తపల్లి: సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాల నుంచి బాలికలను సంరక్షించడం మనందరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాలెంచెరువు గూడెంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు, తల్లులతో బాలసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు లింగ వివక్ష చూపకుండా ఆడ, మగ పిల్లలను పెంచాలన్నారు. వివక్ష వల్లనే బాలికలు సమాజంలో అసమానతలకు గురవుతూ, అఘాయిత్యాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లింగపుల్లమ్మ, పాఠశాల టీచర్లు దరగమ్మ, హనుమంత్ నాయక్, ఆశ వర్కర్ సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఫ్యాషన్ షో



చేనేత వస్త్రాలను ధరించిన విద్యార్థినులు

నందికొట్కూరు: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు బుధవారం చేనేత వస్త్రాలు ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్లుగా డాక్టరు ఆర్.సునీత, అకడమిక్ కో ఆర్డినేటర్ పరిమళాదేవి, లైబ్రేరియన్ రఘుపతిరెడ్డి వ్యవహరించారు. చేనేత వస్త్రాల ప్రత్యేకత తెలుపుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉచితంగా కొబ్బరి మొక్కలు

మహానంది: మండలంలో అరటి పంటలను సాగు చేస్తున్న రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తామని ఉపాధి హామీ పథకం ఏపీఓ మనోహర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలం గట్ల వెంట పెంచుకునేందుకు ఎకరాకు 60 మొక్కల చొప్పున అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు తమ పొలానికి సంబంధించిన పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలతో కార్యాలయంలో సంప్రదించాలని, లేదా ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా సంప్రదించవచ్చని చెప్పారు.

బండిఆత్మకూరు ఎస్‌ఐ బదిలీ

మహానంది: బండిఆత్మకూరు ఎస్‌ఐ కె. మల్లికార్జున కృష్ణగిరికి బదిలీ అయ్యారు. ఈ మేరకు నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు ఎస్‌ఐలను కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 44 మందిని వివిధ స్టేషన్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొక్కజొన్న రైతు కుదేలు

- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- వందల ఎకరాల్లో నీట మునిగిన పైర్లు
- సాగుచేసిన పంటలను తొలగిస్తున్న అన్నదాతలు





నందికుంట గ్రామంలో ట్రాక్టర్ సహాయంతో మొక్కజొన్న పంటను తొలగిస్తున్న రైతు, కొత్తపల్లి సమీపంలో మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపునీరు

కొత్తపల్లి: జూలై నెలలో అధికవర్షాలతో వందల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నాశనమయ్యాయి. పంట ఎదుగుదల కాలపరిమితి పూర్తి కావడంతో పంట దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో సాగుచేసిన పంటలను అక్కడక్కడా తొలగిస్తున్నారు.

4,654 హెక్టార్లలో సాగు..

మండలంలో సాధారణ విస్తీర్ణం 9,090 హెక్టార్లు కాగా అందులో 51 శాతం అంటే 4,654 హెక్టార్లలో అత్యధికంగా రైతులు ఆరుతడి పంటగా మొక్కజొన్నను సాగుచేసుకున్నారు. అయితే మొదట్లో అరకొర వర్షాలు, ఆతరువాత అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. అంతేకాకుండా పైరు ఎదుగుదల కాలం పూర్తికావడం, ఆశించిన మేర ఎదుగుదల లేకపోవడంతో రైతులు పంటలను చెడగొడుతున్నారు. మండలంలోని నందికుంట గ్రామానికి నచిమ్మె మారెన్నతో పాటు మరికొందరు రైతులు సాగుచేసుకున్న మొక్కజొన్న పంటను ట్రాక్టర్ సహాయంతో దున్నేశారు. ఇక్కడే కాకా మండలంలోని ఆయా గ్రామాలలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను తొలగించేందుకు రైతులు సిద్ధమయ్యారు.

కొత్తపల్లిలో 20.4 మి.మీ వర్షపాతం

మండలంలో మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షం 20.4 మి.మీల నమోదయ్యిందని ఏఎస్‌ఓ రాజ్‌పాల్ బుధవారం తెలిపారు. మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, లింగాపురం, గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలతో పాటుగా మండల కేంద్రంలో వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పొలాల్లో వర్షపు నీరు చేరింది. ఇంకా వర్షాలు పడితే మొక్కజొన్న పంటలు నాశనం అవుతాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్ష నష్టం వచ్చింది..



ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసుకునేందుకు 7 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. జూన్ మాసంలో కురిసిన తొలకరి వర్షాలకు ఎకరాకు రూ.10వేలు చెల్లించి కౌలుకు తీసుకున్నాను. విత్తనాలు, విత్తుకు, సేద్యాలకు, మందులు వేసేందుకు రూ.లక్షదాకా ఖర్చు చేశాను. చేసిన ఖర్చంతా నేలపాలు అయింది. అధిక వర్షాలతో మొక్కజొన్న పంట ఎదుగుల నిలిచిపోయింది. లాభం లేకపోవడంతో మొత్తం ట్రాక్టర్ సహాయంతో తొలగించాను. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– చిమ్మె మారెన్న కౌలు రైతు....నందికుంట

మల్లన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



ఆలయ ప్రాంగణంలో శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలం : మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బుధవారం రాత్రి భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి అమ్మవార్ల మహా మంగళహారతి దర్శనం, ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాక్షి గణపతికి ప్రత్యేక పూజలు

శ్రీశైలం : క్షేత్ర పరిధిలోని సాక్షి గణపతికి బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాభిషేకం, క్షీరాభిషేకం, ఫలోదాకాభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు.సంకటహర చవితి, పున్నమి, ప్రతి బుధవారాల్లో సాక్షి గణపతి, రత్నగర్భ గణపతికి సర్కారీ సేవలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు



నెహ్రూనగర్‌లో ప్రజలకు సూచనలు చేస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయ నాయక్

పగిడ్యాల: గురువారం నిర్వహించనున్న పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఎంతటివారైనా చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయ నాయక్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పిల్లల, తల్లిదండ్రులకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులు ఎవరు కనిపించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. నందికొట్కూరు రూరల్ సీఐ బీఆర్ క్రిష్ణయ్య, ముచ్చుమర్రి స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ గంగయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోండి



ఈ-క్రాప్ బుకింగ్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను రైతులు వెంటనే ఈ- క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏ, వీహెచ్‌ఏ లతో పాటు వీఆర్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది, వీఆర్వోలు కలిసికట్టుగా ఈ క్రాప్ బుకింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. రెండుశాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత సమయంలోగా ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియను ముగించాలని సూచించారు. ఖరీఫ్ పంటలు సాగుచేసిన రైతులు, కౌలు రైతులు గ్రామాల్లో ని రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి వీఏఏ, వీహెచ్‌ఏల సహకారంతో పంటలను ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ అంజనేయ

వెలుగోడు: రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని, ఇందుకు రైతు సేవా కేంద్రాలు అండగా నిలవాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్‌చార్జ్ రమణయ్య అన్నారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కార్యాలయంలో ఆత్మకూరు డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి ప్రస్తుతం పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఏడీఏ అంజనేయ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్కే, కేవీకే సమన్వయంతో ఎప్పటికప్పుడు వ్యవసాయంలోని నూతన సాంకేతికతలను రైతులకు త్వరితగతిన అందించి వ్యవసాయం లాభసాటిగా మార్చాలని సూచించారు. రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న, మినుము, సొయాచిక్కుడు పంటల్లో చేపట్టాల్సిన భూసారా ఆధారిత ఎరువుల వినియోగం, పోషక లోపాలపై చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆర్‌ఎస్‌కే లు వ్యవసాయ సాంకేతికతను రైతులకు చేరవేయడంలో వారధులుగా పనిచేయాలని, రైతుకి ప్రధాన సమాచార కేంద్రాలుగా ఉండి ప్రైవేటు ఇన్‌పుట్ డీలర్స్ భాగస్వామ్యాన్ని తగ్గించి రైతుకు సాగు ఖర్చులు తగ్గించాలని సూచించారు. సస్య విజ్ఞాన శాస్త్రవేత్త సుధాకర్ ,డీఆర్సీ ఏడీ సరళమ్మ, వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు ఏఓలు పవన్ కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, శనీశ్వర రెడ్డి, ఫణీశ్వర రెడ్డి, మహేష్, కేవీకే శాస్త్రవేత్త రవి గౌడ్, ఏఈవోలు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ జగన్‌మోహన్

మిడుతూరు: స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద బుధవారం ఎస్ఐ జగన్‌మోహన్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. అనంతరం అనుమతి పత్రాలు లేనివాటికి జరిమానా విధించారు.

చేనేత వస్త్రాలను ధరిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.జిష్ణునాగవిజయ్

ఆత్మకూరు: చేనేత వస్త్రాలను ధరిద్దాం.. నేతన్నకు అండగా ఉందామని ప్రిన్సిపాల్ కె.జిష్ణునాగవిజయ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 1905లో బెంగాల్ రాజధాని కలకత్తాలో ఆగస్టు 7న సమావేశం నిర్వహించి విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని, స్వదేశీ వస్త్రాలను ధరించాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. చేనేత పరిశ్రమ దేశ సంప్రదాయ, సంస్కృతికి చిహ్నం వంటిదని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి గౌనికృష్ణ, అధ్యాపకురాలు పద్మావతిబాయి, సిబ్బంది వెంకటసుబ్బయ్య, తిరుపతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.పి. మండల్‌కు నివాళి

ఆత్మకూరు: స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో బుధవారం సాయంత్రం మండల్ డే కార్యక్రమం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడుయాదవ్, తాలూకా గౌరవాధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బి.పి. మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పోరాటస్ఫూర్తిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు యాదవ్, తాలూకా గౌరవాధ్యక్షుడు రామకృష్ణ కొనియాడారు. వారు మాట్లాడుతూ మండల్ స్ఫూర్తిగా ఆయన కోరిన 40 సిఫార్సులను అమలు చేయాలని కోరారు. నాయకులు బాలస్వామియాదవ్, గోగుల తిమ్మయ్య, రమణయాదవ్, శ్రీహరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంఎస్పీ నాయకుల సంబరాలు

వెలుగోడు: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ కృషితోనే ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ సాధ్యమైందని ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు వాదం నాగశేషులు, జిల్లాకార్యదర్శి బండిఆరోగ్యం అన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలో బుధవారం సంబరాలు చేసుకున్నారు. సంఘం జిల్లా నాయకులు వెంకటరమణ, మండల నాయకులు వేణు, మాజీ సర్పంచ్ జాషువా పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకుండా ఎలా ప్రారంభిస్తారు?



ఎంపీపీ, జెడ్పీటీసీల పేర్లు లేకుండా ఏర్పాటు చేసిన వెటర్నరీ భవనం ప్రారంభోత్సవ శిలాఫలకం

జూపాడుబంగ్లా: మీ విషయంలో ప్రొటోకాల్ పాటించకుండా ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం నిర్వహిస్తే మీరు గమ్మునుంటారా అని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి ఎమ్మెల్యే జయసూర్యను ప్రశ్నించారు. బుధవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో దాతల సహకారంతో రూ.65లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనాన్ని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు. అయితే కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ లకు సమాచారం ఇవ్వకుండా, ప్రొటోకాల్ పాటించకుండా భవనాన్ని ప్రారంభించడంపై జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పశువుల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులను పిలవకపోవడం ఎంత వరకు సమంజమని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన మందడి రఘునాథరెడ్డి స్థలాన్ని ఇవ్వగా, మాజీ టీటీడీ ఈఓ ధర్మారెడ్డి సహకారంతో దాతల వద్ద రూ.65లక్షల నిధులు పోగుచేసి పశువుల ఆసుపత్రి భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఈ భవనాన్ని ఇంకా వెటర్నరీ డిపార్టుమెంటుకు అంకితం చేయకుండానే.. అత్యుత్సాహంతో ప్రారంభించడం వారి దౌర్జన్య పాలనకు నిదర్శనమన్నారు. అలాగే శిలాఫలకంలో ప్రొటోకాల్ ప్రకారంగా ఎంపీ, ఎమ్మెల్యే, సర్పంచు, ఎంపీటీసీల పేర్లు వేసినప్పుడు ఎంపీపీ, జెడ్పీటీసీ పేర్లు కనబర్చాలనే ఇంగితజ్ఞానం లేకుండానే భవనాన్ని ప్రారంభించడం వారి స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. వెటర్నరీ అధికారులు ఎవ్వరూ లేకుండా భవనాన్ని ప్రారంభించిన, అందుకు సహకరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏకపక్షంగా వ్యవహరించడం తగదు

ఓ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు వెటర్నరీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏకపక్షంగా వ్యవహరించటం తగదని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మందడి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ బైరెడ్డి శబరికి సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఎంపీ పేరును ఎలా లిఖిస్తారని ఆయన ప్రశ్నించారు.

మాకు సంబంధం లేదు

పారుమంచాల గ్రామంలో నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనం మాకు ఇంకా స్వాధీనపర్చలేదు. కనుక భవన ప్రారంభోత్సవానికి మాకు ఎలాంటి సంబంధం లేదు. అందుకే డిపార్టుమెంటు అధికారులు ఎవరూ హాజరుకాలేదు. భవనాన్ని దాతల సహకారంతో నిర్మించారు. కనుక వారు ఎలాగైనా ఓపెనింగ్ చేసుకోవచ్చు. భవనాన్ని మాకు స్వాధీనం చేసిన తర్వాత పశుసంవర్ధకశాఖ తరుపున అధికారికంగా మళ్లీ ప్రారంభింపజేస్తాం.

– గోవిందునాయక్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

మహానంది: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల సందర్భంగా ఎవరైనా గొడవలు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు ఉన్నాయన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో జరిగే ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. ఏవైనా వివాదస్పద విషయాలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బండిఆత్మకూరు మండలంలోని పాఠశాలల్లోనూ ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

రిటైర్డు ఉద్యోగులకు అందని పెన్షన్

నందికొట్కూరు: రిటైర్డు ఉద్యోగస్తులకు 7వ తేదీ వచ్చిన ప్రభుత్వం ఎందుకు పింఛన్లు అందించలేదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యాక్షుడు రోషన్న ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మానవతా దృక్పథంతో ఆలోచించి 1వ తేదీన పెన్షన్ ఇవ్వాలన్నారు. రిటైర్డు ఉద్యోగులు చాలా మంది అనారోగ్యంతో బాధపడుతున్నారని, మందులకు డబ్బులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి విశ్రాంత ఉద్యోగులకు తక్షణమే పెన్షన్ బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని కోరారు.

ఆత్మకూరు డీఏఓగా అంజనాదేవి

ఆత్మకూరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నూతన డీఏఓగా టి.అంజనాదేవిని నియమిస్తూ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై ఆత్మకూరుకు రానున్నారు. గతంలో ఆత్మకూరు, కల్లూరు, బేతంచెర్ల, ఆదోని తదితర ప్రాంతాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పాములపాడు: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో జరిగిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి బాధితులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పాములపాడులో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వయనాడ్‌లో చోటుచేసుకున్న ప్రకృతి విలయంలో వందలాది మంది మృత్యువాత పడడం బాధాకరమన్నారు. మానవతావాదులందరూ విరాళాలు ఇచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, రంగస్వామి, జగన్నాథరావు, వెంకటరమణ, మాల మహానాడు నాయకులు అంకన్న, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

రెండు మండలాల్లో భారీ వర్షం



పుట్టుపల్లె వద్ద నిండుగా ప్రవహిస్తున్న పంటకాల్వ

మహానంది: బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. మహానంది మండలంలో 36.2 మి.మీ., బండిఆత్మకూరు మండలంలో 30.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో రెండు మండలాల్లోని పంట పొలాల్లో నీళ్లు నిలిచాయి. గాజులపల్లె, గాజులపల్లె ఆర్ఎస్, అబ్బీపురం గ్రామాల్లోని గిరిజన కాలనీల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోయారు.

మిడుతూరులో 40.2 మి.మీల వర్షం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు అన్ని గ్రామాలల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు వర్షం కురిసింది. దీంతో మండలంలో 40.2 మి.మీలు వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆత్మకూరులో 39.4 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో బుధవారం 39.4 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. ఆత్మకూరు డివిజన్‌లో ఈ యేడాది ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం 27.4 మి.మీ. వర్షం, గత ఆదివారం 6.7 మి.మీ. వర్షం కురిసింది. ఈనెల 1న 21.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈనెల సాధార వర్షపాతం 165 మి.మీ. ఉండగా, ఇప్పటికే 90 మి.మీ.కు పైగా కురిసింది. ఎన్నడూ లేనివిధంగా బవనాసి, సుద్దవాగులు పలుమార్లు పొంగి పొర్లాయి. ప్రస్తుతం సుద్దవాగు, బవనాసి, గుండ్లకమ్మ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే మొక్కజొన్న, కంది పంటలను సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

సచివాలయ ఉద్యోగులకు అందని వేతనాలు

ఆత్మకూరు: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోనున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు ఈనెల వేతనాలు మంజూరు కాలేదు. నెల ప్రారంభమై 8 రోజులు గడుస్తున్నా వేతనం ఇవ్వకపోవడంపై సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కూడా ఇలాగే వేతనాలు మంజూరు కాలేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. స్థానిక మున్సిపల్ అధికారులు, సబ్‌ట్రెజరీ అధికారుల సమన్వయలోపం వల్ల రెండు నెలలుగా వేతనాలు ఆలస్యమవుతున్నాయి. గత నెల 22న వేతనాలు పడగా, ప్రస్తుతం ఎనిమిది రోజులు గడుస్తున్నా వారికి జమ కాలేదు. పట్టణంలోని 13 సచివాలయాల్లో దాదాపు 106 మంది సిబ్బంది వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులతోపాటు వీఆర్వోలు, సోషల్ వెల్ఫేర్‌లు తదితర సిబ్బంది జీతాల కోసం నిరీక్షిస్తున్నారు. తమకు వేతనాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయని పలువురు ఉద్యోగులు ట్రెజరీ కార్యాలయంలో ప్రశ్నించగా టెక్నికల్ సమస్య వల్ల ఆలస్యమయ్యాయని చెబుతున్నారని ఉద్యోగులు చెప్పారు. సచివాలయాల్లో పనిచేస్తున్న 8 మంది సిబ్బందికి ఎంప్లాయి కోడ్ సరిగా లేకపోవడంతో వేతనాలు నిలిపివేశామని, వారికి కోడ్ వచ్చిన వెంటనే వేతనాలు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. సచివాలయ ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు చేస్తున్నామని, సబ్ ట్రెజరీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ల సమస్య కారణమో తెలియడం లేదన్నారు. ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు వేయాలని, బిల్లులను సరి చేయాలని సిబ్బందిని ఆదేశించామని, మరోమారు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.